రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (సోమవారం)
కనిష్ఠం : 26.0

గోదావరిలో స్నానాలు నిషేధం

అనుమతిలేని ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు



కొవ్వూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి కావడంతో కాటన్‌బ్యారేజీ దిగువన మద్దూరు వద్ద ప్రతి రోజూ పెద్దలు.. చిన్నారులు కుటుంబాలతో సహా వచ్చి వందలాది మంది స్నానాలు ఆచరిస్తున్నారు. ఇది ప్రమాదమని చెప్పినా జనం మాత్రం మాటవినడంలేదు.ఈ నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని సీతంపేట, మద్దూరులంక బ్యారేజ్ ప్రాంతాల్లో గోదావరిలో స్నానమాచరించడంపై నిషేధం విధించారు. అనుమతి ఉన్న స్నానఘట్టాల్లో తల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రమే గోదావరి స్నానాలు చేయాలని సూచించారు.అనుమతిలేని ప్రదేశాల్లో స్నానమాచరించడానికి దిగవద్దని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ సూచించారు.మద్దూరులంక బ్యారేజ్ వద్ద గోదావరి నదిలో దిగకుండా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గోదావరి నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నందున స్నానమాచరించడం ప్రమాదకరమన్నారు.నిబంధనలు అతిక్రమించి అనుమతి లేని ప్రదేశాల్లో స్నానం చేస్తే చర్యలు తప్పవన్నారు.

జిల్లా కేంద్రం దాటితే అనుమతి తప్పనిసరి


కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న వృద్ధురాలు

- అధికారులకు కలెక్టర్ క్లాస్ - పీజీఆర్ఎస్‌లో 176 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజలు మళ్లీ మళ్లీ కలెక్టరేట్‌కు వస్తే అది సంబంధిత అధికారి నిర్లక్ష్యంగా పరిగణిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్య నివేదిక (ఏటిఆర్) సమర్పించాలన్నారు.పీజీఆర్ఎస్‌కు కొందరు అధికారులు గైర్హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం విడిచి వెళ్లాలంటే తప్పని సరిగా అనుమతి ఉండాలన్నారు.ఇక నుంచి అందరూ ఈ-ఆఫీస్ ద్వారా సెలవు వివరాలు తెలియజేసి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు. ఏదైనా అర్జీ పరిష్కారం కాదని తెలిస్తే అందుకు కారణాలు వివరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 176 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, డీఎస్పీ భవ్యకిషోర్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి (జేడి) ఎల్.అప్పలకొండ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీకి 35 అర్జీలు



రాజమహేంద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారులకు సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం 35 మంది తమ సమస్యలపై అర్జీలు అందించారు.ఈ అర్జీలు ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు.



అన్నదాత సుఖీభవ అమలుకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో కసరత్తు
- ఈనెల 20కే అర్హుల జాబితా
- అనర్హుల వడపోత
- కొత్తగా మార్పులు..చేర్పులు
- అధికారులకు లాగిన్
- 4.85 లక్షల మందికి లబ్ధి
- రూ.970 కోట్ల నిధులు అవసరం
- కౌలు రైతులకూ వర్తింపు
- 1.80 లక్షల మందికి మేలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెలలోనే అమలు చేయనున్నట్టు ప్రకటించింది. కుటుంబం యూనిట్‌గా రైతుకు రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో సాయం అందించడానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు పథకం అమలుకు వీలుగా రైతుల వివరాలను సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా అందుకున్న అన్నదాతల జాబితా వడపోతకు సన్నాహాలు ఆరంభించారు. వీరికి ప్రభుత్వం తాజాగా లాగిన్‌లు కేటాయించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులు అర్హులుగా తేలనున్నారు. రూ.970కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

రైతన్నకు ఆర్థిక భరోసాయే..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. అందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించింది. రైతు భరోసా పేరుతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు జగన్ ప్రభుత్వం తూట్లు పొడిచి కేవలం కేంద్ర వాటాతో కలిపి రూ. 13,500 ఇచ్చి చేతులు దులిపేసుకున్న తీరును తప్పుబట్టింది. ఈనేపథ్యంలో రైతులకు అండగా ఉండడానికి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల బడ్జెట్‌లో పథకానికి రూ.6,300 కోట్లు కేటాయించారు. పథకం అమలెప్పుడా అని రైతులు ఎదురుచూస్తోన్న తరుణంలో ఎట్టకేలకు సీఎం చంద్రబాబు రైతులకు తీపికబురు అందించారు. పథకాన్ని ఈ నెలలో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం తాజాగా అన్ని జిల్లాల వ్యవసాయ శాఖలకు గత వైసీపీ హయాంలో రైతు భరోసా పథకం తీసుకున్న అన్నదాతల జాబితాలను పరిశీలనకు పంపించింది. వీటిని మండలస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వడపోత పోయాలని ఆదేశించింది. ఇప్పుడు మండలాలవారీగా అధికారులకు జాబితాలో మార్పులు చేర్పులకు వీలుగా లాగిన్‌లు సైతం కేటాయించింది. ప్రభుత్వం పంపిన జాబితాను రెండు వారాలపాటు అధికారులు మండల స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అనంతరం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల వారీగా పథకం పరిధిలోకి ఎంతమంది రైతులు వస్తారనే దానిపై జాబితా తయారుచేస్తారు. అనర్హులను తొలగిస్తారు. ఆదాయపన్నుదారులు ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాములను గుర్తించి పేర్లను తప్పించనున్నారు. కొత్తగా అర్హులను గుర్తించి జాబితాలో చేర్చనున్నారు. ఈనెల 20 నాటికి అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేయనున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున రూ.970 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

కౌలు రైతులకు పండగే..

ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది వరకు అన్నదాతలు పథకం అమలు కిందకు రానున్నారు.అయితే రాష్ట్రప్రభుత్వం సాధ్యమైనంత ఎక్కువమంది రైతులకు పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది.గత వైసీపీ హయాంలో రకరకాల సాకులతో అర్హులను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టేసింది. ఈ నేపథ్యంలో అన్న దాతలను ఇబ్బంది పెట్టకుండా దాదాపు అందరికీ లబ్ధి చేకూర్చాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కొత్తగా కౌలు రైతులను పథకం పరిధిలోకి తేవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో 65 వేలు, కోనసీమ జిల్లాలో 61 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 54 వేల మంది వరకు అన్నదాతలు పథకం పరిధిలోకి రానున్నారు.ఒకరకంగా కౌలు రైతులకు ఇది వరమే అని చెప్పాలి. ప్రస్తుతం కౌలు రైతు కార్డులు కలిగిన వారినే అధికారులు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇవిలేని వారిని పథకం పరిధిలోకి తీసుకువస్తే జాబితా మరింత పెరగనుంది. మరో పక్క గత ప్రభుత్వం వీరిని అసలు రైతులుగానే పరిగణించలేదు. కానీ కూటమి ప్రభుత్వం వీరిని కూడా అర్హుల జాబితాలోకి చేర్చింది.అటవీ భూములపై హక్కులు (ఆర్‌ఓఎఫ్ఆర్) కలిగిన అన్నదాతలకు పథకం ఇస్తున్నట్టు ప్రకటించింది. దీనివల్ల కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు,శంఖవరం, రౌతులపూడి మండలాల్లో అటవీభూములు సాగు చేస్తోన్న వెయ్యి మంది వరకు అన్నదాతలకు ఆర్థిక లబ్ధి కలగనుంది. గతంలో వీరిని ఏప్రభుత్వంకనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

రైతుల సమస్యకు.. మూడు పరిష్కారాలు

- ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెంపు
- జిల్లాలో మరో 2 లక్షల టన్నులు
- తేమశాతం 22 ఉన్నా కొనాలి
- మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ 1:2
- అధికారుల తీరుపై అసహనం
- వాడివేడిగా మంత్రి నాదెండ్ల సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో సోమవారం సాయంత్రం మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజా ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, జేసీలతో సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ని అదనంగా పెంచామని తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు, కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేల టన్నులకు అదనంగా మరో 50 వేల టన్నులు పెంచామన్నారు. గత 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.11,400 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తేమ 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను ఆదేశించారు. కోనసీమలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీని 1:1 ఇవ్వడంపై మంత్రి అటు జేసీ, ఇటు సివిల్ సప్లయిస్ అధికారుల వివరణ కోరారు. ఎమ్మెల్యేల సూచన, మిల్లర్ల కోరిక మేరకు బ్యాంకు గ్యారెంటీ 1:2 ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకూడదు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన హామీలు కచ్చితంగా అమలు చేయాలన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం..

ధాన్యం కొనుగోలు విషయమై మంత్రి మనోహర్ వద్ద అనపర్తి, జగ్గంటపే, మండపేట, కొత్తపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు కాకినాడ,తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల అధికారులపై పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోనసీమ జేసీ ధాన్యం సేకరణపై ఇచ్చిన వివరణలపై మంత్రి మనోహర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ధాన్యం కొనుగోలు అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ అడిగిన ప్రశ్నలకు జేసీ చినరాముడు సరిగా స్పందించకపోవడంతోపాటు ఎమ్మెల్యే నెహ్రూ చెప్పిన విషయాలపైనా ఆయన పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో మంత్రి అసహనం వ్యక్తంచేశారు. ఒక దశలో జేసీని ప్రత్యేకంగా కలవాలని సూచించారు. అటు సివిల్ సప్లయిస్ డీఎంపైనా తనదైనశైలిలో మండిపడ్డారు. పదే పదే తమకు ఎమ్మెల్యేలతో ఫోన్లు చేయించడమేంటని.. క్షేత్రస్థాయిలో తిరగాలని సూచించారు. ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న అంశాలను కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మంత్రికి వివరించారు. అనంతరం మూడు జిల్లాల జేసీలు ఇప్పటివరకు తమ జిల్లాల్లో రబీ ధాన్యం సేకరణ ప్రగతిని వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యానికి మద్దతు ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. రైతు సేవా కేంద్రాల టార్గెట్ పెంచాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. జిల్లాలో కొనుగోళ్ల పెండింగ్ రూ.16.75 లక్షల కమీషన్ చెల్లింపు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో 40 శాతం ధాన్యం రోడ్డుపైనే ఉందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల జేసీలు చినరాముడు, టి.నిషాంతి, మూడు జిల్లాల రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్న రామకృష్ణ (కాకినాడ), కర్రి వెంకటరెడ్డి (తూర్పు గోదావరి), చౌదరి (కోనసీమ) పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొంటాం : దుర్గేష్

రాజమహేంద్రవరం: ధాన్యం సేకరణ విషయంలో వైసీపీ అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ధాన్యం అమ్మకాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీంతో మరో 50 వేల టన్నుల సేకరణకు అనుమతి లభించిందని చెప్పారు.




కలెక్టర్‌కు మాజీ ఎంపీ భరత్ వినతి

భూమాఫియాపై భరత్ వినతి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్పొరేషన్ పరిధి ఒకటోవార్డు సాయిదుర్గానగర్,లాలాచెరువులో దాదాపు రూ.10 కోట్ల విలువైన 1300 గజాల స్థలాన్ని కొందరు వ్యక్తులు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ ఎంపీ మార్గాని భరత్ తెలిపారు. సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం చేశారు.ఇటువంటి ఘటనలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు

- జిల్లాలో 3.30 లక్షల టన్నులు
- ఇప్పటికే 2.63 లక్షల టన్నులు సేకరణ
- రైతులకు రూ.477 కోట్లు చెల్లింపు
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఉండ్రాజవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా చరిత్రలోనే ఈ రబీలో అత్యధికంగా 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఉండ్రాజవరం మండలం పసలపూడి, వడ్లూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. తొలుత 2 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, తర్వాత దానిని 2.50 లక్షల టన్నులకు పెంచామన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు 3.30 లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా విధించామన్నారు. ఇప్పటికే 2,63,076 టన్నుల సేకరణ పూర్తయిందన్నారు.దానికి సంబంధించి రూ.612 కోట్లకు రూ.477 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని జేసీ చిన్న రాముడు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటిస్తూ రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.పసలపూడి రైతు సేవా కేంద్రంలో రికార్డులు అప్‌డేట్‌గా ఉండకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వడ్లూరు గ్రామంలో రైతుల సేవా కేంద్రం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడంలేదని పసలపూడి, వడ్లూరు గ్రామాల్లో ఆదివారం రైతుల నిరసన చేపట్టిన నేపథ్యంలో ఆమె పరిశీలించారు. చివటం గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి.. ఎంత వరకు సర్వే జరిగిందని అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట డీపీవో శాంతమణి, డీఎల్‌పీవో అమ్మాజీ,తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు,ఏవో విశ్వాసరావు,ఈవో పీఆర్డీ ఆంజనేయశర్మ, సర్పంచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అన్నదాతల ఆందోళన

నిడదవోలు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత రోడ్డెక్కాడు.. పంటను కొనుగోలు చేయకపోతే ఎలా అంటూ మండిపడ్డాడు.ఈ మేరకు సోమవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ధర్నాకు దిగారు.నిడదవోలు మండలంలోని డెల్టా పరివాహక ప్రాంతాలైన సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కోరుపల్లి, జీడిగుంట, గోపవరం, విజ్జేశ్వరం తదితర ప్రాంతాల రైతులు సోమవారం రైతు సేవా కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చారు. ప్రభుత్వ లక్ష్యం పూర్తయ్యిందని.. మరింత ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు రాలేదని చెప్పడంతో ఆందోళన చెందిన రైతులు ధర్నాకు దిగారు. ఈ మేరకు సమాచారం అందుకున్న తహశీల్దార్ నాగరాజు నాయక్, వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వం మరింత ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడుతుందని ఆందోళన చెందవద్దంటూ సర్ది చెప్పారు.నిడదవోలు మండలంలో 58 వేల మెట్రిక్ టన్నులకు 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇంకా రైతాంగం వద్ద 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. మరో ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మంగళవారం నాటికి ఆదేశాలు వస్తాయని సమాచారం.రేపు ఉదయానికల్లా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడతామని రైతాంగానికి తెలపడంతో ఆందోళన విరమించారు.రైతుల ఆందోళనతో సుమారు గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు అవస్థలు పడ్డారు. సమిశ్రగూడెం ఎస్ఐ వీరబాబు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


రోడ్డుపై బైఠాయించి నిరసన.. స్తంభించిన ట్రాఫిక్

భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు

- రేపటి నుంచి అన్నవరం సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు
- 8న దివ్యకల్యాణం, 11న రథోత్సవం
- 50వేలమంది విచ్చేస్తారని అంచనా
- ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు


కల్యాణోత్సవ ఏర్పాట్లను ఈవోతో కలిసి పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి

అన్నవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుని వార్షిక కల్యాణ ఘడియలు సమీపిస్తున్న వేళ అన్నవరం దేవస్థానం అధికార యంత్రాంగం భక్తుల సౌకర్యాల కల్పనకు ఇతర శాఖల సహకారంతో చర్యలు చేపడుతున్నట్టు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు ఈ నెల 7న ప్రారంభమై 13తో ముగుస్తాయన్నారు. ప్రధానంగా 8వ తేదీ రాత్రికి జరిగే దివ్యకల్యాణం, 11వతేదీ సాయంత్రం 4గంటలకు నిర్వహించే రథోత్సవం కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారని దీనికనుగుణంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవస్థానం ఇతరశాఖల సమన్వయంతో ఎక్కడా లోటుపాట్లు లేకుండా తగిన ప్రణాళికలతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 8న దివ్యకల్యాణం వీక్షించేందుకు సుమారు 50వేలమంది విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేశామన్నారు. పటిష్ఠమైన క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం నిరంతరం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. 8న సాయంత్రం 4గంటల నుంచి కొండపైకి భారీ వాహనాలను అనుమతించకుండా కొండదిగువ జూనియర్ కళాశాల మైదానంలో పార్కింగ్ సౌకర్యం కల్పించి అక్కడ నుంచి భక్తులను దేవస్థానం బస్సుల్లో ఉచితంగా కొండపైకి తీసుకెళ్లడం జరుగుతుందని, కల్యాణం అనంతరం 9 ప్రత్యేక కౌంటర్ల ద్వారా ముత్యాల తలంబ్రాల అక్షింతల పంపిణీ చేపడుతున్నామని ఈవో తెలిపారు. ఈ ఏడాది దివ్యకల్యాణోత్సవాలు వారంరోజులు మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు ఫైర్ ఇంజన్లు, వైద్యసదుపాయాల కోసం అంబులెన్సు, కొండపైన వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే దివ్యకల్యాణోత్సవ ఆహ్వానపత్రికలను ప్రముఖులకు అందజేయడం జరిగిందని ఆయన చెప్పారు. భక్తులు దివ్యకల్యాణం తిలకించి సత్యదేవుడి కృపకు పాత్రులుకావాలని ఈవో సుబ్బారావు కోరారు.

సింహాచలం ఘటన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి

అన్నవరంలో ఏర్పాట్ల పరిశీలన

ఇటీవల సింహాచలం దేవస్థానంలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకుని కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నవరంపై ప్రత్యేక దృష్టి సారించారు. సత్యదేవుని వార్షిక కల్యాణం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఆదేశాలతో సోమవారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి కల్యాణోత్సవ ప్రాంగణాన్ని పరిశీలించారు. కల్యాణం వీక్షించేందుకు భక్తుల సిట్టింగ్ సామర్థ్యం, బారికేడ్ల ఏర్పాటు, క్యూలైన్ వ్యవస్థ, విద్యుత్‌లైన్ వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు ఉన్నారు.

పెద్ద రథానికి ట్రయల్‌రన్

సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాల్లో ఈనెల 11న జరిగే రథోత్సవానికి వినియోగించే పెద్ద రథానికి సోమవారం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సమక్షంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. సుమారు 35 అడుగుల పొడవుల గల ఈ రథంతో కార్యక్రమం నిర్వహించడం అధికారులకు కత్తి మీద సాములా మారింది. గతేడాది ఈ రథోత్సవం ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు గ్రామంలో మెయిన్‌రోడ్డు మీదుగా జరగనుండడంతో గతేడాది గ్రామంలో విద్యుత్‌సరఫరా నిలుపుదలచేశారు. దీంతో గ్రామస్థులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఆ ఇబ్బందులు లేకుండా సెంటర్ లైటింగ్‌ను జనరేటర్ సాయంతో వెలిగించి కేవలం మెయిన్‌రోడ్డుపై విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి గ్రామంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరిగేలా దేవస్థానం విద్యుత్‌విభాగం, ఏపీఈపీడీసీఎల్ అధికారులు సంయుక్తంగా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ట్రయల్‌రన్ విజయవంతమైనట్టు అధికారులు తెలిపారు.


ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న అధికారులు

సింహాచలం ఘటనలో మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

రూ.25 లక్షల వంతున చెక్కులు అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే


కుంపట్ల శేషారావు తండ్రి శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అంబాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో గోడ కూలిన ఘటనలో జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారని, బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సింహాచలం చందనోత్సవ కార్యక్రమానికి వెళ్లి గత నెల 30న గోడ కూలిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. అంబాజీపేట గ్రామం కొర్లపాటివారిపాలెనికి చెందిన పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల ఈశ్వరమణికంఠశేషారావులు గోడకూలి మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కొర్లపాటివారిపాలెంలో స్వామినాయుడు తండ్రి పత్తి వీరవెంకట సత్యనారాయణ, శేషారావు తండ్రి శ్రీనివాసరావుకు చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు అందించారు. స్వామినాయుడు, మణికంఠ చిత్రపటాల వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, ఇన్‌చార్జ్ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, సుంకర బాలాజీ, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి వెంకటేశ్వరరావు, బాబి తదితరులు ఉన్నారు.

పాముగండిలో అంతు చిక్కని వ్యాధి

గుర్తించలేకపోతున్న అధికారులు

బాధపడుతున్న గిరిజనులు


అంతుచిక్కని వ్యాధితో మంచం పట్టిన పదేళ్ల చిన్నారి కోసు వర్షిణి

దేవీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరానికి 17 కిలోమీటర్లు దూరంలో దేవీపట్నం మండలం పాముగండి గ్రామంలో గిరిజనులు 20 రోజులుగా అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నారు. సుమారు 40మంది జ్వరాలతో అల్లాడిపోతూ పాదాల నుంచి మోకాళ్ల వరకు కాళ్ల వాపుతో మంచానపడ్డారు. వ్యాధి తగ్గకపోవడంతో గిరిజనులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే వైద్యాధికారులు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించినా వ్యాధిని గుర్తించలేకపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని సర్పంచ్ శివారెడ్డి కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్ స్తంభంపై రవికృష్ణ మృతదేహం


ఫైల్‌ఫొటో

అంతర్వేది, మే 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూల గ్రామంలో అకాల వర్షాలకు తెగిపోయిన విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో గొర్ల రవికృష్ణ (35) మృతి చెందాడు. ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రవికృష్ణ గ్రామంలో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచానామా నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రవికృష్ణకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. టీడీపీ కార్యకర్తగా ఉన్న రవికృష్ణకు క్రియాశీలక సభ్యత్వం ఉందని మండలాధ్యక్షుడు ఎమ్.నాని తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

గొల్లప్రోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారులోని చౌడు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్టు వీఆర్వో కె.మంగతాయారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, ఎటువంటి వివరాలు అందుబాటులో లేవని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 17 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1,2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17 మంది పట్టుబడారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 8 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, మరో 9మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

» రైతులకు అన్యాయం జరగదు » మంత్రి నాదెండ్ల మనోహర్ » కాకినాడ జిల్లాలో తడిచిన ధాన్యం రాశుల పరిశీలన


జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట రూరల్/కాకినాడ రూరల్/ పెద్దాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సుడిగాలి పర్యటన చేశారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి పర్యటించి అకాల వర్షాలతో తడిచిపోయిన ధాన్యం రాశులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలతో తడిచిపోయిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు మంత్రికి విన్నవించుకున్నారు. నాదెండ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని హామీఇచ్చారు. తడిచిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దన్నారు. ఇక్కడి సమస్యను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పర్యటనకు వచ్చానన్నారు. జిల్లాలో 95వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసే విధంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. అవసరమైతే మరో 50వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు కూడా ఆలోచిస్తున్నామన్నారు. జగ్గంపేట మండలంలో 250 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి దృష్టికి నెహ్రూ తీసుకెళ్లగా అవసరమైతే 350 మెట్రిక్ టన్నులు అవసరమైన కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేసేందుకు ప్రయతిస్తున్నాయని, నమ్మవద్దని వారి కుట్రలను తిప్పి కొట్టాలని రైతులను కోరారు. ఆయన వెంట జేసీ రాహుల్‌మీనా, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, సివిల్ సప్లై డీఎం దేవలనాయక్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, కుడా చైర్మన్ తుమ్మలబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ ఉన్నారు.

కాకినాడ రూరల్ మండలం చీడిగ హైవే రోడ్డుపై తడిసిపోయిన ధాన్యాన్ని మంత్రి మనోహర్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి పరిశీలించారు. రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిబంధనలు పాటించని రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్డీవో మల్లిబాబును ఆదేశించారు. పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో తడిసిన ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖను సమాయత్తంచేసినట్టు చెప్పారు.


కాకినాడ రూరల్ మండలం చీడిగలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి

పేదల వైద్యానికి సహకారం అమోఘం

కలెక్టర్ షాన్‌మోహన్

'కెఎస్‌పీఎల్' రూ.55 లక్షలతో జీజీహెచ్‌కు మౌలిక సదుపాయాలు


ఐసీయూలో పడకలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

జీజీహెచ్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ (కెఎస్‌పీఎల్) అందించిన సహాయ, సహకారాలు అమోఘమైనవని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ కొనియాడారు. జీజీహెచ్ ట్రామా కేర్ విభాగంలో సోమవారం కెఎస్‌పీఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటి (సీఎస్ఆర్)లో భాగంగా రూ.55 లక్షలతో సమకూర్చిన 3 వెంటిలేటర్‌లు, 8 మల్టీపారా మానిటర్‌లు, 8 ఐసీయూ పడకలు, 8 గైనకాలజీ పరిశీలన బెంచీలను సంస్థ ఎండీ కెవిరావు, కలెక్టర్, ఎంపీ తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్ సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.పాండురంగ విఠల్‌కు అప్పగించారు. అనంతరం సర్జరీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు రూ.55 లక్షలతో మౌలిక సదుపాయాలను సమకూర్చడం అభినందనీయమని కేఎస్‌పీఎల్ ఎండీ కేవీ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ ఉదయ్ మాట్లాడుతూ నాలుగైదు జిల్లాల నుంచి నిత్యం రోగులు, క్షతగాత్రులు, గర్భిణులు వేల సంఖ్యలో జీజీహెచ్‌కు వస్తుంటారన్నారు. గతేడాది 8 లక్షలమంది అవుట్ పేషెంట్లు, 17 వేలమంది ఇన్‌పేషెంట్లు జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందగా, సుమారు 45 వేల సర్జరీలు జరగడం గర్వకారణమన్నారు. జీజీహెచ్ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులుగా తాము, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేశామన్నారు. జీజీహెచ్ భవిష్యత్తుతరాలకు వైద్య సేవలనం దించే నిష్ణాతులైన వైద్య నిపుణులను అందిస్తుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో త్వరలో జీజీహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలందించడంలో జీజీహెచ్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. గతంలో కెఎస్‌పిఎల్ జీజీహెచ్‌కు చాలా సార్లు సహకారాన్ని అందించదని గుర్తుచేశారు. ఎంసీ హెచ్ విభాగ నిర్మాణ పనులు పూర్తయితే 500 పడకలు నూతనంగా అందుబాటులోకి వస్తాయని తద్వారా ఆసుపత్రిపై భారం తగ్గి మరింత నాణ్యమైన వైద్య సేవలందించేందుకు దోహదపడుతుందన్నారు. కెఎస్‌పిఎల్ ఎండి కెవిరావును ప్రత్యేకంగా సత్కరించారు. కెఎస్‌పిఎల్ సీఈవో మురళీధర్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న, ఆర్థోప్రొఫెసర్ డాక్టర్ ముఖర్జీ ఉన్నారు.

'ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై రైతులకు అవగాహన అవసరం'


వ్యవసాయ సేద్య విధానాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొవ్వూరు, మే 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో జిల్లా ఏరువాక కేంద్రం, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. భరతలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, నూతన వంగడాలు, లాభదాయకమైన సేద్యం, మార్కెటింగ్, వివిధ పంటల దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు గత 4 నెలలుగా గ్రామాల్లో నైరా కళాశాల విద్యార్థుల కార్యకలాపాలను వివరించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అనువైన, అధిక దిగుబడులను ఇచ్చే సార్వా, దాళ్వా రకాలను సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.సీహెచ్‌వీ.నరసింహరావు, మానుకొండ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, ఎంపీటీసీ రోహిణి కోమలి, వ్యవసాయశాఖ కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్, శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుమల రెడ్డి, ఇంజనీరు అప్పారావు, అభ్యుదయ రైతులు, నైరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 4 బంగారు పతకాలు

సత్తా చాటిన కాకినాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు సాధించారు. జూన్‌లో బెంగళూరులో 40 దేశాలతో జరిగే ఏషియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన శ్రీనివాసరావును పలువురు అభినందించారు.



బంగారు పతకాలు అందుకుంటున్న డ్రైవర్ శ్రీనివాసరావు

పుట్టినరోజు వేడుకకు పయనమై..

ఆటో బోల్తా పడి ఒకరు మృతి, నలుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

గొల్లప్రోలు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళ మృతిచెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఆర్లంక రామలక్ష్మి, రౌతు సత్యవతి, అప్పలనరస, లక్ష్మి అదే గ్రామానికి చెందిన గోవిందు ఆటోలో కొత్తపల్లి మండలం గోర్సలో జరిగే బంధువుల కుమార్తె పుట్టినరోజు వేడుకలో పాల్గొనేందుకు బయల్దేరారు. తాటిపర్తి జంక్షన్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో సమీపంలోని పొలాల్లోకి బోల్తా పడి పల్టీలు కొట్టింది. ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యారు. తొలుత వారిని పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామలక్ష్మి (50) మరణించింది. రామలక్ష్మి భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘ సేవ, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యం

జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, ముగిసిన యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్ర స్థాయి శిబిరం


రెడ్‌క్రాస్ వలంటీర్లతో జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు

కాకినాడ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారతీయులు సంఘ సేవ, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తారని కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే.ప్రసాద్ అన్నారు. కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ, కాకినాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి శిబిరం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించినట్టు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఈ వేడుకలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ, సమాజసేవలో రెడ్‌క్రాస్ వలంటీర్లు ముందుండడం హర్షించదగ్గ విషయమన్నారు. వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కాకినాడ శాఖ చైర్‌పర్సన్ ఎన్.సుగుణారెడ్డి, కార్యదర్శి కె.శివకుమార్, ప్రిన్సిపాల్ కరుణ, శివరామకృష్ణతేజేశ్వరరావు, దుర్గాదేవి, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, చిరంజీవి, నాగరాజు ఉన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి రథోత్సవం

గోదావరి నదిలో స్వామివారికి త్రిశూల స్నానం

ఐ.పోలవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆఖరి రోజున గవ్యాంతం, కళాన్యాసం, వసంతోత్సవం వంటి పూజలు జరిగాయి. 70మంది వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను మురమళ్ళ పుష్కరాల రేవుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం వృద్ధగౌతమిలో స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులైన శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పుష్పోత్సవం, పవళింపుసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ రాజేష్ గురుకుల్ శిష్యబృందం ఐదురోజుల పాటు చేసిన అలంకరణలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు ముగింపు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని వీరేశ్వరుని పూజలు చేశారు.


మురమళ్ళలో శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యాలు



కోచింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): పోలీస్ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్ ను పోలీసుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డీ.నరసింహకిషోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్‌ను సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి క్రికెట్, టెన్నిస్, వాలీబాల్ ఆడారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చిన్నపిల్లల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ ఏర్పాటు చేశామని, ఈ నెల 31 వరకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6నుంచి 8వరకు , సాయంత్రం 4నుంచి 7గంటల వరకు షటిల్, టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక పీఈటీ, కోచ్‌లను నియమించినట్టు పేర్కొన్నారు. ప్రతి రోజు క్యాంప్‌నకు వచ్చే పిల్లలకు బలాన్నిచ్చే రాగిజావ, కోడిగుడ్డు, అరటి పండ్లు వంటి పౌష్టికాహారం ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బీరాముకృష్ణ, సీఐ ఎక్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ప్రజల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ఆయన ప్రజల నుంచి 19 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణ, వసతి స దుపాయాల కల్పనపై దృష్టిపెట్టాలని సూచించారు. పలు సమస్యలపై అర్జీలను పరిశీలించి వాటిపై బాధితులతో మాట్లాడారు. వాటికి నాణ్యమైన పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు, ఎస్‌ఈ డాక్టర్ వినూత్న, ఎస్‌ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ సేవలను వినియోగించుకోవాలి

ఖైదీలతో సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సేవలు వినియోగించుకోవాలని ఖైదీలతో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఆహార, సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలు, ఖైదీల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఖైదీల తరఫున ఉచితంగా వాదించడానికి న్యాయవాదులు అవసరమైనా, బెయిల్ పిటిషన్లు, ఫైళ్లలో అప్పీళ్లు వేయాలన్నా డీఎల్ఎస్ఏని సంప్రదించాలన్నారు. దీని కోసం సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలను తమకు పంపాలని సూచించారు. నిందితులు, ఖైదీల కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను కూడా ఉపయోగించుకోవాలన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజునే ఎస్ఆర్‌వీఎం కిట్లు

» విద్యార్థులకు అందజేయాలి » ఎంఈవోలకు సీఎంవో శ్రీనివాస్ సూచన



ఎస్ఆర్‌వీఎం కిట్ల పంపిణీపై ఎంఈవోలకు సూచనలిస్తున్న సీఎంవో

విశ్వవేలు, మే 5(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన రోజునే (జూన్ 12) విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేయాలని ఎస్ఎస్ఏ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ ఎంఈవోలకు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. మండలానికి 1 నుంచి పదో తరగతి వరకు 17,258 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా 13,002 అందాయని ఎంఈవో-1 సీహెచ్.వీవీ సత్యనారాయణ తెలిపారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూలు, సాక్సులు, నోట్ బుక్స్, బెల్టులు, డిక్షనరీలు, యూనిఫామ్‌లు ఈ నెలాఖరులోగా అందజేస్తామని సీఎంవో వివరించారు. వచ్చిన ప్రతి బడుల వెంటనే పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేయాలని ఆయన సూచించారు.ఆయన వెంట ఏఎం ఓ గౌరీశంకర్, ఎంఈవో-2 పూర్ణచంద్రరావు, సీఆర్‌పీ వామదేవ, ఎంఐఎస్ శ్రీవాస్, అకౌంటెంట్ సతీష్ ఉన్నారు.

వాసవిమాతకు సామూహిక కుంకుమ పూజ



కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు

దవళేశ్వరం, మే 5(ఆంధ్రజ్యోతి): దవళేశ్వరంలో కన్యక పరమేశ్వరి వాసవిమాత జయంతి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన సోమవారం గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, వాస వి మాత, శ్రీ చక్రానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ జరిపారు. యువ వైశ్య సంఘం ఆధ్వర్యంలో పోలిసెట్టి సత్యనారాయణ ప్రధాన రథం సేవపై మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం వాసవి గీత మహిళా స మాజం ఆధ్వర్యంలో పేరంటం జరిపి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించాలి

ఎంపీడీవోకు జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్ వినతి

కడియం, మే 5(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ ఉపాధి శ్రామికులకు పని కల్పించాలని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ సోమవారం ఎంపీడీవో కె.రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ జేగురుపాడులో ఫీల్డ్ అసిస్టెంట్ లేక ఉపాధి శ్రామికులకు ఎటువంటి పని కల్పించడం లేదన్నారు. శ్రామికులు మాట్లాడుతూ ఐదేళ్ల ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ వచ్చి రెండు రోజులు పని చేయించారని, రాని ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని తెలిపారు. తమకు రోడ్డున పడకుండా పని కల్పించి ఆదుకోవాలని ఎంపీడీవోను కోరారు.

ప్రసూతి సెలవుల నిబంధనల్లో మార్పు హర్షణీయం

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, మే5 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవు నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేయడం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ నారి జయ త్రినాథబాబు అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు గతంలో ఉన్న 120 రోజుల సెలవులను పూర్తిజీతంతో 180 రోజులకు పెంపు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అలాగే ఇకపై పిల్లల సంఖ్య పరిమితిని కూడా తొలగించడం వల్ల ఎంతో మంది మహిళా ఉద్యోగులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తక్షణం ఈ జీవో అమలులోకి వచ్చే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల జయత్రినాథబాబు సంతోషం వ్యక్తంచేశారు.

వృద్ధులకు వాకర్స్ పించన్ల పంపిణీ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ సవ్యం ద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణ గాడిన్‌లో అధ్యక్షుడు శనపతి సత్యిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి, ఏపీపీ నాగేంద్ర, రీజనల్ కౌన్సిలర్ బండి శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.నాగేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. సంస్థ 14 ఏళ్లుగా నిర్విరామంగా వృద్ధుల పింఛన్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనసూరి శ్రీనివాస్, ఉప్పులూరి కాశీ విశ్వనాథ్, శీలం రామకృష్ణ, మాధూరి రాముకృష్ణ, ఉపదిల్లి రామకృష్ణ, గోపాలకృష్ణ, సురేష్, లంక శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వేగులమ్మ జాతర

అత్తింటికి తరలిన నర్సాపురం గ్రామదేవత

కోరుకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురంలో ఐదు రోజులపాటు జరిగిన గ్రామదేవత వేగులమ్మ జాతర మనంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు జరిగింది. మంగవాయిద్యాలు, గరగ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వేగులమ్మ రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి 10గంటలకు ప్రారంభమైన ఈ ఊరేగింపు సోమవారం ఉదయం 10గంటల వరకు సాగింది. అనంతరం గ్రామస్తులు వీర సారెతో అమ్మవారిని పుట్టింటి నుంచి అత్తింటికి సాగనంపారు.జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌లో శరవేగంగా పనులు

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోము

» రాజమహేంద్రవరంలో రూ.1.32 కోట్ల వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపనలు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరంలో 9, 10 డివిజన్లలోని గాదాల మ్మనగర్, లాలూకు నగర్ పార్కు ప్రాంతాల్లో రూ.1.32 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారి పనులకు వారిద్దరూ సోమవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అవసరమైన చోట్ల రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరంలోని ప్రధాన మార్గాల్లో అవసరం లేకపోయినా డివైడర్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించారని, బీసీలు నివసించే ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో తాము మార్పుచేసి చూపించామన్నారు. 15 ఏళ్లుగా ఉన్న గోదావరి బండ్ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభిస్తామని చెప్పడానికి ఆనంద పడుతున్నామన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ భవిష్యత్ ప్రజలకు అవసరమయ్యే అన్ని సదుపాయాలు ఆదిరెడ్డి వాసు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యం

స్థానిక లాలాచెరువు సూర్యనమస్కారాల పార్కు వద్ద సోమవారం టీడీపీ నాయకులు రవి యాదవ్, ఆతడి సోదరుడు బీజేపీ నాయకుడు మరుకుర్తి నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో సహృదయ ఫౌండేషన్, మదర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజావైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని, రాజమండ్రిలో ప్రభుత్వాసుపత్రిని మెరుగుపరిచామని, ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని వారికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చేయిస్తున్నామన్నారు. రవి యాదవ్ సోదరుడు దుర్గాయాదవ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జనసేన యువజన విభాగం నాయకుడు జక్కంపూడి గణేష్, కాంగ్రెస్ నాయకుడు ఆలంకం గోపి, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, నెక్కల బాబూరావు యాదవ్, డాక్టర్ రామా ఉషాకిరణ్, గండేపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

11,280 మెట్రిక్ టన్నుల మిగులు ధాన్యం

రైతుల నుంచి కొనుగోలు చేయాలని మంత్రి మనోహర్‌కు ఎమ్మెల్యే బత్తుల వినతి



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మే 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల వద్ద 11,280 మెట్రిక్ టన్నుల మిగులు ధాన్యం ఉందని, దానిని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు కాకినాడలో మంత్రి మనోహర్‌ను ఎమ్మెల్యే బత్తుల సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన మిగులు ధాన్యం కొనుగోలు అంశాన్ని విన్నవించారు. నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం ఇంకా మిగిలి ఉందని, అకాల వర్షాల కారణంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో 100 మెట్రిక్ టన్నులు, నాగంపల్లిలో 580, మిర్తిపాడులో 80, రఘుదేవపురంలో 4,620, చినకొండేపూడిలో 600, ముగ్గళ్లలో 250, వంగలపూడిలో 300, సింగవరం 450, కాటవరంలో 300 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఇంకా మిగిలి ఉందన్నారు. అలాగే కోరుకొండ మండలం జంబూపట్నంలో 50, మునగాల 140, రామవరపురం 50, కోటికేశవరం 50, దోసకాయలపల్లి 50, బొల్లి ద్దుపాలెంలో 510, కోటిలో 100, నరసాపురంలో 50, శ్రీరంగపట్నంలో 100, మధురపూడిలో 50, బూరుగుపూడిలో 50, నిడిగట్లలో 50 మెట్రిక్ టన్నుల మిగులు ధాన్యం ఉన్నట్టు మంత్రికి నివేదించారు. రాజానగరం మండలం సంపత్‌నగరంలో 250, యర్రంపాలెంలో 300, ముక్కినాడలో 100, తోకాడలో 2,100, నందరాడలో 150, నరేంద్రపురంలో 50 మెట్రిక్ టన్నుల మొత్తంగా మూడు మండలాల్లోనూ 11,280 మెట్రిక్ టన్నుల మిగులు ధాన్యం ఉన్నట్టుగా వినతి పత్రంలో పొందుపర్చారు. దీనిపై మంత్రి మనోహర్ స్పందిస్తూ రాష్ట్రంలో అన్నదాతలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రైతుల వద్ద నుంచి ఆఖరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ విషయమై తక్షణం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చారన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ అధికారులు, ఉద్యోగులు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మెలో ఎల్ఐసీ క్లాస్-3, 4 ఉద్యోగులు సుమారు 50 వేల మంది భాగస్వామ్యం అవుతున్నారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను మోరంపూడి జంక్షన్ వద్ద ఎల్ఐసీ రాజమండ్రి డివిజనల్ ఆఫీసు నుంచి విరామ సమయంలో ఆవిష్కరించినట్టు చెప్పారు. పాలసీదారులు సౌకర్యార్థం బీమా పాలసీ లపై జీఎస్టీని రద్దు చేయాలని, క్లాస్-3, 4 ఉద్యోగాలను భర్తీ చేయాలని, అందరికీ 1995 పథకం అమలు చేయాలని, కనీస వేతనం రూ.26,000 వర్తింపజేయాలని డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె. మాధ్యూస్, మహిళా కన్వీనర్ శిరీష, ఎస్.గన్నెయ్య, కె.విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, సత్యదేవ,జి.శ్రీనివాసరావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటామని తెలియజేస్తూ ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం అధికారులకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీపవన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అంతా పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటిస్థానంలో తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.అన్నామణి, టి.నాగమణి, బేబీ కుమారి, అనూష, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

8న మూలారెడ్డి విగ్రహావిష్కరణ



దొడ్డిగుంటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల 8న నియోజకవర్గంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు పలువురు కూటమి ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, పైలవరపు సాయిరామ్, గెడ్డాల సత్తిబాబు, వెలమాటి సుదార్, కొమ్మన రాంబాబు, సత్తి దేవానందరెడ్డి పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రపంచ స్థాయిలో మరింత వ్యాప్తి చెందాలని దానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. 108 సూర్య నమస్కారాలు, 108 నిమిషాల్లో 21,850 మంది గిరిజన విద్యార్థులతో చేయించిన, వరల్డ్ రికార్డు యూనియన్-యూకే అర్గనైజేషన్ ప్రపంచ రికార్డు సాధించిన ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్‌ను అభినందన సత్కారం స్థానిక వైఎంసీఏ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు నిత్యజీవితంలో యోగా ప్రాముఖ్యత, దాని విశిష్టతను వివరించారు. శ్రీనివాస్ విజయాన్ని కొనియాడారు. అనంతరం యోగా గురువులను, సాధకులను ప్రపంచ రికార్డు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, మానస హాస్పిటల్స్ డాక్టర్ కర్రి రా మారెడ్డి, శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత టి.టూర్ విజయప్రకాష్, ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, ప్రింటోనికా ఎండీ సత్యప్రసాద్, రవి గోకుల మురళి విచ్చేశారు. కార్యక్రమంలో నిమ్మలపూడి గోవింద, ఎం.రామకోటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో రతన్‌టాటా

ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రం

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే క్రమంలో రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రధాన కేంద్రం అమరావతిలో 2024లో ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా ప్రారంభించారని, దానికి అనుబంధంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఐదు ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించారు. దానిలో ఉభయగోదావరి జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం రాజమహేంద్రవరంలో ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు ఆమోదించారన్నారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అందుబాటులో ఉన్న భవనాలను పరిశీలించి మోరంపూడి శ్రీవెంకటేశ్వరస్వామి ఆల యం సమీపంలో భూమి శ్రీనివాస భవనాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. పరిశోధన, ఆవిష్కృతి సహకారం, స్టార్టప్‌లకు కార్యాలయ స్థలం, నిధులు, మార్గదర్శనం వంటివి ఈ ప్రాజెక్టు ప్రాథమిక అంశాలని కమిషనర్ పేర్కొన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు

దేవరపల్లి, మే5 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తృతీయ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద తిరువీధి ఉత్సవం, విశ్వక్సేనా ఆరాధన, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురార్పణం, మంగళాశాసనం కార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు ఆర్ట్స్ కళాశాల పీజీ గ్రాడ్యుయేషన్ డే

రాజమహేంద్రవరం అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తొలిసారిగా పీజీ గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ సందర్భంగా 2018, 2019, 2020 సంవత్సరాల విద్యార్థులకు పీజీ డిగ్రీలను అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసన్న, బీఎంటీయూ వీసీ ఆచార్య మధుకర్ బాబు ఎస్ పద్మ, కళాశాల ఉన్నత విద్యాశాఖ జేడీ సీహెచ్ కృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బ్యాగ్ మరిచిన ప్రయాణికుడు

అప్పగించిన రైల్వే పోలీసులు

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ఓ బృందంలోని ప్రయాణికుడు రమేష్ పటేల్ తన బ్యాగ్ టీ కోచ్‌లో మర్చిపోయారు. దానిని గుర్తించిన రైల్వే పోలీసులు బ్యాగ్‌ను సురక్షితంగా అప్పగించారు. బ్యాగ్‌లో రూ.విలువ గల నగదు సురక్షితంగా ఉండడంతో రమేష్ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

'కులగణనకు కేంద్ర కేబినెట్ ఆమోదం రాహుల్ క్రెడిటే'

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): కులగణనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకోవడం వెనుక కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఒత్తిడి ఉందని ఈ క్రెడిట్ తమ నాయకుడికే దక్కుతుందని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బిల్లర్ బాబీ అన్నారు. సోమవారం కులగణనపై కేంద్ర కేబినెట్ ఆమోదాన్ని హర్షిస్తూ నగరంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన జరపాలని రాహుల్‌గాంధీ చేసిన సూచనలతో ఆయా రాష్ట్రాలు కులగణన చేపట్టాయని, దీంతో కేంద్రం కదిలిందన్నారు. కులగణన వల్ల బడుగు బలహీన వర్గాలకు, మైనార్టీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. ఇది కాంగ్రెస్ విజయమన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ శిక్షణలో

తప్పక పాల్గొనాలి

రంగంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్ శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకున్న మహిళలందరూ క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ శిక్షణలో పాల్గొనాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ అన్నారు. సోమవారం రంగంపేట వెలుగు కార్యాలయంలో జరుగుతున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ చేతి వృత్తుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా శిక్షకు 140 మంది మహిళలు రెండు బ్యాచ్‌లుగా కుట్టుమిషన్ ట్రైనర్ బొడ్డు జయలక్ష్మి తెలిపారు.

సారా నిర్మూలనకు కాల్ 14405

• ఒక మహిళపై పీడీ యాక్ట్

• ఎక్సైజ్ శాఖ సీఐ సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): ఎన్ని సార్లు హెచ్చరించినా, కేసులు పెట్టినా సారా విక్రయాలు ఆపకపోవడంతో ఒక మహిళపై పీడీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్టు రాజమహేంద్రవరం సౌత్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి తెలిపారు. అయ్యప్పనగర్‌కు చెందిన పోలిశెట్టి లక్ష్మీ సారా తయారీ, విక్రయాలు చేస్తుండడంతో తమ ఉన్నతాధికారుల ఆదేశాలతో కలెక్టర్ పీడీ యాక్టు ప్రకారం కేసు నమోదుకు సిఫారసు చేశామన్నారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో పీడీ యాక్టు కింద కేసు పెట్టి మహిళా ప్రత్యేక కారాగారానికి తరలించామన్నారు. సారా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు చేసే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. సారా వ్యాపారాన్ని వీడి.. సారా నిర్మూలను అమలు చేస్తున్న నవోదయం 2.0లో భాగస్వాములు కావాలన్నారు. సారాపై ప్రత్యేక నిఘా ఉంచామని, ప్రజలు కూడా సారాపై సమాచారం ఉంటే తమకు తెలియజేసి సహకరించడం బాధ్యతగా భావించాలన్నారు. సమాచారాన్ని 14405, 94409 02411కు చేరవేయాలని, అవసరమైతే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

అసంఘటిత కార్మికులకు ఈశ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి బివన్న ఆదేశానుసారం కార్మిక శాఖ, పారా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు ఈశ్రమ కార్డ్ పోర్టల్ రిజిస్ట్రేషన్, అవగాహన కార్యక్రమం జరిగింది. సోమవారం స్థానిక మోహి వీధిలోని అబూబకర్ షా మసీదులో నిర్వహించిన కార్యక్రమానికి న్యాయసహాయ రక్షణ మండలి న్యాయవాదులు జేవీవీ రమణ, వైవి వరలక్ష్మి, జి.వేణుగోపాల్, ఉదయ్ గనిని, పారా సంస్థ ప్రతినిధి ఎండీ అమీర్ పాషా, ఎండీ అక్రమ్, మసీద్ ట్రెజరర్ నూర్, జిల్లా కార్మిక శాఖ ఏఎల్‌ఓ లలిత విచ్చేసి కార్మికులకు అవగాహన కల్పించి, ఈశ్రమ కార్డు పోర్టల్ రిజిస్ట్రేషన్ చేశారు.

ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో చర్చించాలి

» భారత్‌తో యుద్ధం జరిగితే పాకిస్తాన్ నష్టపోతుంది » మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన విషయంలో ఏపీకి జరిగిన అన్యాయంపై ఇప్పటికైనా పార్లమెంట్‌లో నోటీసు ఇచ్చి చర్చ జరపాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరారు. రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్యాయంగా విభజన చేశారంటూ తాను సుప్రీంకోర్టులో పిటిషన్‌వేసి 11 ఏళ్లు పూర్తయిందని, ఇప్పటి వరకు 43 వాయిదాలకు హాజరయ్యానని చెప్పారు. విభజన విషయంలో చేసింది తప్పొప్పా అనేది తేల్చమని కోరానని చెప్పారు. ఈ కేసులో కేంద్రం ఇప్పటివరకు కౌంటర్ కూడా దాఖలు చేయలేదన్నారు. అయితే 2023 ఫిబ్రవరి 23న ఏపీ ప్రభుత్వం విభజన వల్ల జరిగిన నష్టాన్ని వివరిస్తూ తన వాదనను బలపరుస్తూ కౌంటర్ దాఖలు చేయడం బలాన్నిచ్చిందన్నారు. దీని కొనసాగింపుగా ఒక నేషనల్ వాయిదాని ఏర్పాటు చేసి సుప్రీంకోర్టులో కేసు నిలబడేలా చూడాలని కోరారు. కేంద్రానికి ఏపీ నుంచి మద్దతు ఇస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్పందించాలని పార్లమెంట్‌లో చర్చించేలా చొరవచూపాలన్నారు. ఇక కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి విషయాన్ని కలిచివేసిందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అందరు సమర్ధించాలన్నారు. అయితే ఈ విషయంలో పాకిస్తాన్‌ను వ్యతిరేకించాలే తప్ప ముస్లిం వ్యతిరేకత సృష్టించరాదన్నారు. మతం ప్రాతిపదిక అనేది మన దేశంలో సమంజసం కాదన్నారు. లౌకికవాదమే మందిరమన్నారు. యుద్ధం అంటూ జరిగితే పాకిస్తాన్ నష్టపోతుందన్నారు. ప్రస్తుత తరుణంలో మత విద్వేషాలు రెచ్చగొట్టకూడదని ఉండవల్లి పేర్కొన్నారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 41.0 (సోమవారం)

కనిష్ఠం : 26.0



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న వృద్ధురాలు

గోదావరిలో స్నానాలు నిషేధం

అనుమతిలేని ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు



కొవ్వూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి కావడంతో కాటన్‌బ్యారేజీ దిగువన మద్దూరు వద్ద ప్రతి రోజూ పెద్దలు.. చిన్నారులు కుటుం బాలతో సహా వచ్చి వందలాది మంది స్నానాలు ఆచరిస్తున్నారు. ఇది ప్రమాదమని చెప్పినా జనం మాత్రం మాటవినడంలేదు.ఈ నేప థ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని సీతంపేట, మద్దూరులంక బ్యారేజ్ ప్రాంతాల్లో గోదావరిలో స్నానమాచరించడంపై నిషేధం విధించారు. అనుమతి ఉన్న స్నానఘట్టాల్లో తల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రమే గోదావరి స్నానాలు చేయాలని సూచించారు.అనుమతిలేని ప్రదేశాల్లో స్నానమాచరించడానికి దిగవద్దని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ సూచించారు.మద్దూరులంక బ్యారేజ్ వద్ద గోదావరి నదిలో దిగకుండా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గోదావరి నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నందున స్నానమాచరించడం ప్రమాదకరమన్నారు.నిబంధనలు అతిక్రమించి అనుమతి లేని ప్రదేశాల్లో స్నానం చేస్తే చర్యలు తప్పవన్నారు.

జిల్లా కేంద్రం దాటితే అనుమతి తప్పనిసరి

- అధికారులకు కలెక్టర్ క్లాస్ - పీజీఆర్ఎస్‌లో 176 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజలు మళ్లీ మళ్లీ కలెక్టరేట్‌కు వస్తే అది సంబంధిత అధికారి నిర్లక్ష్యంగా పరిగణిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్య నివేదిక (ఏటిఆర్) సమర్పించాలన్నారు.పీజీఆర్ఎస్‌కు కొందరు అధికారులు గైర్హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం విడిచి వెళ్లాలంటే తప్పని సరిగా అనుమతి ఉండాలన్నారు.ఇక నుంచి అందరూ ఈ-ఆఫీస్ ద్వారా సెలవు వివరాలు తెలియజేసి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు. ఏదైనా అర్జీ పరిష్కారం కాదని తెలిస్తే అందుకు కారణాలు వివరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 176 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, డీఎస్పీ భవ్యకిషోర్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి (జేడి) ఎల్.అప్పలకొండ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీకి 35 అర్జీలు



రాజమహేంద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారులకు సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం 35 మంది తమ సమస్యలపై అర్జీలు అందించారు.ఈ అర్జీలు ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు.

అన్నదాతకు.. ఆనందమే!



అన్నదాత సుఖీభవ అమలుకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో కసరత్తు
- ఈనెల 20కే అర్హుల జాబితా
- అనర్హుల వడపోత
- కొత్తగా మార్పులు..చేర్పులు
- అధికారులకు లాగిన్
- 4.85 లక్షల మందికి లబ్ధి
- రూ.970 కోట్ల నిధులు అవసరం
- కౌలు రైతులకూ వర్తింపు
- 1.80 లక్షల మందికి మేలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెలలోనే అమలు చేయనున్నట్టు ప్రకటించింది. కుటుంబం యూనిట్‌గా రైతుకు రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో సాయం అందించడానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు పథకం అమలుకు వీలుగా రైతుల వివరాలను సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా అందుకున్న అన్నదాతల జాబితా వడపోతకు సన్నాహాలు ఆరంభించారు. వీరికి ప్రభుత్వం తాజాగా లాగిన్‌లు కేటాయించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులు అర్హులుగా తేలనున్నారు. రూ.970కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

రైతన్నకు ఆర్థిక భరోసాయే..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. అందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించింది. రైతు భరోసా పేరుతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు జగన్ ప్రభుత్వం తూట్లు పొడిచి కేవలం కేంద్ర వాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి చేతులు దులిపేసుకున్న తీరును తప్పుబట్టింది. ఈనేపథ్యంలో రైతులకు అండగా ఉండడానికి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల బడ్జెట్‌లో పథకానికి రూ.6,300 కోట్లు కేటాయించారు. పథకం అమలెప్పుడా అని రైతులు ఎదురుచూస్తోన్న తరుణంలో ఎట్టకేలకు సీఎం చంద్రబాబు రైతులకు తీపికబురు అందించారు. పథకాన్ని ఈ నెలలో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం తాజాగా అన్ని జిల్లాల వ్యవసాయ శాఖలకు గత వైసీపీ హయాంలో రైతు భరోసా పథకం తీసుకున్న అన్నదాతల జాబితాలను పరిశీలనకు పంపించింది. వీటిని మండలస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వడపోత పోయాలని ఆదేశించింది. ఇప్పుడు మండలాలవారీగా అధికారులకు జాబితాలో మార్పులు చేర్పులకు వీలుగా లాగిన్‌లు సైతం కేటాయించింది. ప్రభుత్వం పంపిన జాబితాను రెండు వారాలపాటు అధికారులు మండల స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అనంతరం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల వారీగా పథకం పరిధిలోకి ఎంతమంది రైతులు వస్తారనే దానిపై జాబితా తయారుచేస్తారు. అనర్హులను తొలగిస్తారు. ఆదాయపన్నుదారులు ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాములను గుర్తించి పేర్లను తప్పించనున్నారు. కొత్తగా అర్హులను గుర్తించి జాబితాలో చేర్చనున్నారు. ఈనెల 20 నాటికి అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేయనున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున రూ.970 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

కౌలు రైతులకు పండగే..

ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది వరకు అన్నదాతలు పథకం అమలు కిందకు రానున్నారు.అయితే రాష్ట్రప్రభుత్వం సాధ్యమైనంత ఎక్కువమంది రైతులకు పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది.గత వైసీపీ హయాంలో రకరకాల సాకులతో అర్హులను జగన్ ప్రభు త్వం పక్కనపెట్టేసింది. ఈ నేపథ్యంలో అన్న దాతలను ఇబ్బంది పెట్టకుండా దాదాపు అందరికీ లబ్ధి చేకూర్చాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కొత్తగా కౌలు రైతులను పథకం పరిధిలోకి తేవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో 65 వేలు, కోనసీమ జిల్లాలో 61 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 54 వేల మంది వరకు అన్నదాతలు పథకం పరిధిలోకి రానున్నారు.ఒకరకంగా కౌలు రైతులకు ఇది వరమే అని చెప్పాలి. ప్రస్తుతం కౌలు రైతు కార్డులు కలిగిన వారినే అధికారులు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇవిలేని వారిని పథకం పరిధిలోకి తీసుకువస్తే జాబితా మరింత పెరగనుంది. మరోపక్క గత ప్రభుత్వం వీరిని అసలు రైతులుగానే పరిగణించలేదు. కానీ కూటమి ప్రభుత్వం వీరిని కూడా అర్హుల జాబితాలోకి చేర్చింది.అటవీ భూములపై హక్కులు (ఆర్‌ఓఎఫ్ఆర్) కలిగిన అన్నదాతలకు పథకం ఇస్తున్నట్టు ప్రకటించింది. దీనివల్ల కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు,శంఖవరం, రౌతు లపూడి మండలాల్లో అటవీభూములు సాగు చేస్తోన్న వెయ్యి మంది వరకు అన్నదాతలకు ఆర్థిక లబ్ధి కలగనుంది. గతంలో వీరిని ఏప్రభుత్వంకనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.

వర్రీ.. తీరినట్టే!



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

రైతుల సమస్యకు.. మూడు పరిష్కారాలు

- ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెంపు
- జిల్లాలో మరో 2 లక్షల టన్నులు
- తేమశాతం 22 ఉన్నా కొనాలి
- మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ 1:2
- అధికారుల తీరుపై అసహనం
- వాడివేడిగా మంత్రి నాదెండ్ల సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో సోమవారం సాయంత్రం మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజా ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, జేసీలతో సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ని అదనంగా పెంచామని తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు, కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేల టన్నులకు అదనంగా మరో 50 వేల టన్నులు పెంచామన్నారు. గత 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.11,400 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తేమ 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను ఆదేశించారు. కోనసీమలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీని 1:1 ఇవ్వడంపై మంత్రి అటు జేసీ, ఇటు సివిల్ సప్లయిస్ అధికారుల వివరణ కోరారు. ఎమ్మెల్యేల సూచన, మిల్లర్ల కోరిక మేరకు బ్యాంకు గ్యారెంటీ 1:2 ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకూడదు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన హామీలు కచ్చితంగా అమలు చేయాలన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం..

ధాన్యం కొనుగోలు విషయమై మంత్రి మనోహర్ వద్ద అనపర్తి, జగ్గంటపేట, మండపేట, కొత్తపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు కాకినాడ,తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల అధికారులపై పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోనసీమ జేసీ ధాన్యం సేకరణపై ఇచ్చిన వివరణలపై మంత్రి మనోహర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ధాన్యం కొనుగోలు అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ అడిగిన ప్రశ్నలకు జేసీ చినరాముడు సరిగా స్పందించకపోవడంతోపాటు ఎమ్మెల్యే నెహ్రూ చెప్పిన విషయాలపైనా ఆయన పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో మంత్రి అసహనం వ్యక్తంచేశారు. ఒక దశలో జేసీని ప్రత్యేకంగా కలవాలని సూచించారు. అటు సివిల్ సప్లయిస్ డీఎంపైనా తనదైనశైలిలో మండిపడ్డారు. పదే పదే తమకు ఎమ్మెల్యేలతో ఫోన్లు చేయించడమేంటని.. క్షేత్రస్థాయిలో తిరగాలని సూచించారు. ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న అంశాలను కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మంత్రికి వివరించారు. అనంతరం మూడు జిల్లాల జేసీలు ఇప్పటివరకు తమ జిల్లాల్లో రబీ ధాన్యం సేకరణ ప్రగతిని వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యానికి మద్దతు ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. రైతు సేవా కేంద్రాల టార్గెట్ పెంచాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. జిల్లాలో కొనుగోళ్ల పెండింగ్ రూ.16.75 లక్షల కమీషన్ చెల్లింపు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో 40 శాతం ధాన్యం రోడ్డుపైనే ఉందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల జేసీలు చినరాముడు, టి.నిషాంతి, మూడు జిల్లాల రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్న రామకృష్ణ (కాకినాడ), కర్రి వెంకటరెడ్డి (తూర్పు గోదావరి), చౌదరి (కోనసీమ) పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొంటాం : దుర్గేష్

రాజమహేంద్రవరం: ధాన్యం సేకరణ విషయంలో వైసీపీ అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ధాన్యం అమ్మకాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీంతో మరో 50 వేల టన్నుల సేకరణకు అనుమతి లభించిందని చెప్పారు.





కలెక్టర్‌కు మాజీ ఎంపీ భరత్ వినతి

భూమాఫియాపై భరత్ వినతి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్పొరేషన్ పరిధి ఒకటోవార్డు సాయిదుర్గానగర్,లాలా చెరువులో దాదాపు రూ.10 కోట్ల విలువైన 1300 గజాల స్థలాన్ని కొందరు వ్యక్తులు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ ఎంపీ మార్గాని భరత్ తెలిపారు. సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం చేశారు.ఇటువంటి ఘటనలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

- జిల్లాలో 3.30 లక్షల టన్నులు
- ఇప్పటికే 2.63 లక్షల టన్నులు సేకరణ
- రైతులకు రూ.477 కోట్లు చెల్లింపు
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

ఉండ్రాజవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా చరిత్రలోనే ఈ రబీలో అత్యధికంగా 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఉండ్రాజవరం మండలం పసలపూడి, వడ్లూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. తొలుత 2 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, తర్వాత దానిని 2.50 లక్షల టన్నులకు పెంచామన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు 3.30 లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా విధించామన్నారు. ఇప్పటికే 2,63,076 టన్నుల సేకరణ పూర్తయిందన్నారు.దానికి సంబంధించి రూ.612 కోట్లకు రూ.477 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని జేసీ చిన్న రాముడు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటిస్తూ రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.పసలపూడి రైతు సేవా కేంద్రంలో రికార్డులు అప్‌డేట్‌గా ఉండకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వడ్లూ రు గ్రామంలో రైతుల సేవా కేంద్రం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడంలేదని పసలపూడి, వడ్లూరు గ్రామాల్లో ఆదివా రం రైతుల నిరసన చేపట్టిన నేపథ్యంలో ఆమె పరిశీలించారు. చివటం గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి.. ఎంత వరకు సర్వే జరిగిందని అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట డీపీవో శాంతమణి, డీఎల్‌పీవో అమ్మాజీ,తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు,ఏవో విశ్వాసరావు,ఈవో పీఆర్డీ ఆంజనేయశర్మ, సర్పంచ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అన్నదాతల ఆందోళన

నిడదవోలు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత రోడ్డెక్కాడు.. పంటను కొనుగోలు చేయకపోతే ఎలా అంటూ మండిపడ్డాడు.ఈ మేరకు సోమవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ధర్నాకు దిగారు.నిడదవోలు మండలంలోని డెల్టా పరివాహక ప్రాంతాలైన సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కోరుపల్లి, జీడిగుంట, గోపవరం, విజ్జేశ్వరం తదితర ప్రాంతాల రైతులు సోమవారం రైతు సేవా కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చారు. ప్రభుత్వ లక్ష్యం పూర్తయ్యిందని.. మరింత ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు రాలేదని చెప్పడంతో ఆందోళన చెందిన రైతులు ధర్నాకు దిగారు. ఈ మేరకు సమాచారం అందుకున్న తహశీల్దార్ నాగరాజు నాయక్, వ్యవసాయాధికారి జి.సత్యనారా యణ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వం మరింత ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడుతుందని ఆందోళన చెందవద్దంటూ సర్ది చెప్పారు.నిడదవోలు మండలంలో 58 వేల మెట్రిక్ టన్నులకు 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇంకా రైతాంగం వద్ద 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉం డిపోయింది. మరో ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మంగళవారం నాటికి ఆదేశాలు వస్తాయని సమాచారం.రేపు ఉదయానికల్లా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడతామని రైతాంగానికి తెలపడంతో ఆందోళన విరమించారు.రైతుల ఆందో ళనతో సుమారు గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు అవస్థలు పడ్డారు. సమిశ్రగూడెం ఎస్ఐ వీరబాబు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన.. స్తంభించిన ట్రాఫిక్

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ పీజీఆర్ఎస్‌లో ఐదు ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వ్యయప్రయాసలకు గురై ఆర్డీవో కార్యాలయానికి రానవసరం లేదని, ప్రతి సోమవారం తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయాల్లో మండల స్థాయిలో అధికారులు పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నారన్నారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి సమస్యలు చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో కె. రవివిక్రమ్, వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు



రైతులను సన్మానిస్తున్న సర్పంచ్ పరశురామారావు, అధికారులు

తాళ్లపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన, నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయని సర్పంచ్ కొమిరెడ్డి పరశురామారావు అన్నారు. వేగేశ్వరపురంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు రైతులైన పెట్టా సుబ్బారావు, తైలం చంద్రశేఖర్, పోతిరెడ్డి గనిరాజు, తైలం వీరవెంకట సత్యనారాయణను స్థానిక రైతుసేవా కేంద్రంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సాయంలో పండించిన వరిలో మంచి దిగుబడులు వచ్చాయన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగాంజ నేయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరలక్ష్మి, రైతులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

నిడదవోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రతినిధులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, 12వ పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రత్తి సువర్ణరాజు, ఏవీ అప్పారావు, బి.వెంకటేశ్వరరావు, దానరాజు, పి.విష్ణు, ఎన్‌వీవీ చౌదరి, ఎం.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

దేవరపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శుల అసోసియేషన్ ఎన్నిక సోమవారం ఏకగ్రీవమైంది. ఈఓపీఆర్డీ వై.రాజారావు అధ్యక్షతన ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షుడిగా షేక్ నజీర్‌అహ్మద్ (గౌరీపట్నం), ఉపాధ్యక్షులుగా సంధ్యారాణి, (కురుకూరు), షేక్ మొహిద్దీన్ షరీఫ్ (బంధపురం), ప్రధాన కార్యదర్శిగా ఆర్.గంగాధరరావు, (త్యాజంపూడి), కోశాధికారిగా ఎం.రాణి, (చిన్నాయిగూడెం), సభ్యులుగా సీహెచ్ ప్రతాప్ (సంగాయిగూడెం), ఎం.ఝాన్సీరాణి, (దుద్దుకూరు) కే.శ్రీనివాసరావు (ధూమంతనగూడెం), మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డీఎల్ఎస్ఏ సేవలను వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సేవలు వినియోగించుకోవాలని ఖైదీలతో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె కేంద్ర కారాగారాన్ని సందర్శించి, ఆహార, సదుపాయాలను పరిశీలించారు. ఖైదీలు, ఖైదీల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు, నాయకులు

కొవ్వూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో సంస్కరణల పేరుతో 117 జీవోతో ప్రయోగాలు చేయడం శోచనీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్న దుర్గారావు అన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద పాఠశాలల్లో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా, ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఇన్‌చార్జి ఏవో కే. రవివిక్రమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు పూర్వప్రాథమిక విద్యను అనుసంధానించాలన్నారు. ప్రతి పాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కనీసం ఇద్దరు ఎస్‌జీటీలను నియమించాలన్నారు. జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ 12వ పీఆర్సీని నియమించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. పీఆర్టీయూ నేత ఫణికుమార్ మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సలీం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్నిరకాల బకాయిలను చెల్లించాలన్నారు. షేక్‌జానీ మాట్లాడుతూ తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పి. గంగరాజు, యాదం శంకరం, జి. కృష్ణ, ఏ. చంద్రశేఖర్, జె. రామారావు, సోమేశ్వరరావు, భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ని అమలుచేయాలి



ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కొవ్వూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ని తక్షణం అమలుచేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డిపో సెక్రటరీ ఎం. శివకుమార్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ని తక్షణమే అమలు చేయాలని, సస్పెన్షన్‌లో ఉన్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. వీకేఎం స్వామి, వై. బాబూరావు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ, విజ్ఞానంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భరతలక్ష్మి

కొవ్వూరు, మే (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ, విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం. భరతలక్ష్మి అన్నారు. సోమవారం ధర్మవరం జిల్లా ఏరువాక కేంద్రం, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. భరతలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, నూతన వంగడాలు, లాభదాయకమైన సేద్యం, మార్కెటింగ్, వివిధ పంటల దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు గత నాలుగు నెలలుగా గ్రామాలలో నైరా కళాశాల విద్యార్థుల కార్యకలాపాలను వివరించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాలలో అనువైన, అధిక దిగుబడులను ఇచ్చే సార్వా, దాళ్వా రకాలను సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్‌వీ నరసింహరావు, మానుకొండ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, ఎంపీటీసీ రోహిణి కోమలి, వ్యవసాయశాఖ కొవ్వూరు ఏడీఏ పి. చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్. జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఏ. గంగాధర్, శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుమలరెడ్డి, ఇంజనీరు అప్పారావు, అభ్యుదయ రైతులు, నైరా కళాశాల విద్యార్థులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానా

తాళ్లపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడపితే భారీ జరిమానా తప్పదని, అలాగే చట్టరీత్యా నేరమని ఎస్ఐ టీ. రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెల్మెట్‌ధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి'

కొవ్వూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె. నాగలక్ష్మి అన్నారు. సోమవారం నందమూరు సచివాలయంలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అసంఘటితరంగ కార్మికులకు కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మెజిస్ట్రేట్ నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి 7 వరకు అసంఘటితరంగ కార్మికులకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి. హరీష్, వీవీపీ లక్ష్మి, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

నిడదవోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి ఆర్‌వీ రావు అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై 15 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. వైఏ గాంధీ, కె.రమేష్, వెంకటేష్, మద్దాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు



తీపర్రులో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

పెరవలి, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా తీపర్రు శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పడం, చెప్పించడం, భగవద్గీత పఠనాలు నేర్పించడం వంటివి చేశారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ ప్రియాంక, గ్రంథాలయ అధికారులు జయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8 నుంచి వెంకన్నస్వామి వార్షిక కల్యాణోత్సవాలు



పెరవలి, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 8 నుంచి 12 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రాధాకృష్ణ తెలిపారు. ఈ ఐదురోజుల పాటు ఎదుర్కోలు ఉత్సవం, కల్యాణోత్సవాలు, సుదర్శన హోమం, సదస్యం, తులసి బృందార్చన, సామూహిక కుంకుమార్చన, చక్రస్నానం, శ్రీ పుష్ప ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ఆలయ ఆవరణమంతా పందిళ్లు వేసి విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఐదురోజుల పాటు ఉదయం, సాయంత్రం అన్నదానం భక్తుల సహకారంతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కోలాటం, కూచిపూడి, భరతనాట్యం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పది, ఇంటర్ పాసైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న సంస్థ సభ్యులు

తాళ్లపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): మలకపల్లిలో పది, ఇంటర్ పాసైన విద్యార్థులకు దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మరపట్ల అరుణ్ కుమార్ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముఖ్యఅతిథిగా ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ యువత ఏదైనా సాధించాలంటే అది విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో శెట్టిమాలి మోహన్, నేరేడిమల్లి చంద్రశేఖర్, దాసరి హితేష్, కోనాల అభిషేక్, దాసరి రాకేష్ సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో గరుడవాహన ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవిభూదేవి సమేత స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తృతీయ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ఆచార్య ఆహ్వానం, సేనాధిపతి శ్రీవిశ్వక్‌సేన తిరువీధి ఉత్సవం, విశ్వక్‌సేన ఆరాధన, పున్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోహణం, ధ్వజపటవాస్తు, మంగళశాసనం కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, స్థానికులు తీగల బలరామయ్య, యాగంటి శ్రీనివాస్, గుడ్ల వెంకటేశ్వరరావు, దుగ్గిన సూర్యచంద్రం, సింగులూరి సుధాకర్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటామని తెలియజేస్తూ ఆశ వర్కర్లు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం అధికారులకు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అంతా పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్షురాలు కె.అన్నామణి, టి.నాగమణి, బేబీ కుమారి, అనూష, జయమ్మ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మెలో ఎల్ఐసీ క్లాస్-3, 4 ఉద్యోగులు సుమారు 50 వేల మంది భాగస్వామ్యం అవుతున్నారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను మోరంపూడి జంక్షన్ వద్ద ఎల్ఐసీ రాజమండ్రి డివిజనల్ ఆఫీ సులో విరామ సమయంలో ఆవిష్కరించినట్టు చెప్పారు. పాలసీదారులు సౌకర్యార్థం బీమా పాలసీ లపై జీఎస్టీని రద్దు చేయాలని, క్లాస్-3, 4 ఉద్యోగాలను భర్తీ చేయాలని, అందరికీ 1995 పథకం అమలు చేయాలని, కనీసవేతనం రూ.26,000 వర్తింపజేయాలని డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె. మాధ్యూస్, మహిళా కన్వీనర్ శిరీష, ఎస్.గన్నెయ్య, కె.విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, సత్యదేవ, జి.శ్రీనివాసరావు, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలోనూ...

ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలి



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చాగల్లు, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ప్రమోషన్లలోనూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను అమలు చేయాలని ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌డీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌డీవో రాణీసుస్మితను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి. మధుశేఖర్, కే.భీష్మ గాంఘేయుడు, పెనుమాక జయరాజు, కొప్పాక విజయానంద జవహర్, తదితరులు పాల్గొన్నారు.

152 మందికి ఉచిత వైద్యపరీక్షలు



చివటంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉండ్రాజవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): చివటం జేసీఎం చర్చి వద్ద సోమవారం ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో పాస్టర్ టి. అబ్బులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 152 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ నాయకులు, న్యాయవాది పొట్ల సురేష్, ఆసుపత్రి పీఆర్‌వో ఎస్. శ్యామ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే వాసు



యోగా పతంజలి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యేయ వాసు, ఎమ్మెల్సీ వీర్రాజు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రపంచ స్థాయిలో మరింత వ్యాప్తి చెందాలని దానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. 108 సూర్య నమస్కారాలు, 108 నిమిషాల్లో 21,850 మంది గిరిజన విద్యార్థులతో చేయించి, వరల్డ్ రికార్డు యూనియన్-యూకే ఆర్గనైజేషన్ ప్రపంచ రికార్డు సాధించిన ప్రణవ సంకల్ప యోగ సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్‌కు అభినందన సత్కారం స్థానిక వైఎంవీఏ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు నిత్యజీవితంలో యోగా ప్రాముఖ్యత, దాని విశిష్టతను వివరించారు. శ్రీనివాస్ విజయాన్ని కొనియాడారు. అనంతరం యోగా గురువులకు, సాధకులకు ప్రపంచ రికార్డు ప్రశంసా పత్రాలను అంద జేశారు. కార్యక్రమానికి కలెక్టర్ పి.ప్రశాంతి, మానస హాస్పిటల్స్ డాక్టర్ కర్రి రామారెడ్డి, శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత చిట్టూరి విజయప్రకాష్, ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కోళ్ళ అచ్యుతరామారావు, ప్రింటోనికా ఎండీ సత్యవరపు గోకుల మురళి విచ్చేశారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో నిమ్మలపూడి గోవిందు, ఎం.రామకోటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.